క్లుప్తంగా

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా నగరంలో గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎం.భాస్కరరావు బుధవారం తెలిపారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు గొడుగుపేట, చెమ్మనగిరిపేట, విజయవాడ రోడ్డు ప్రాంతాలు, చిలకలపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఎన్జీవో కాలనీ, విశ్వబ్రాహ్మణ కాలనీ, ఆర్టీసీ కాలనీ, ఎల్ఐసీ కాలనీ, దిమ్మల సెంటర్, భాస్కరపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

బంటుమిల్లి: బంటుమిల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వి.చినబాబు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ జి.ఎస్.రామకృష్ణరాజు తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొనాలని ఆయన కోరారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ విజ్ఞప్తి చేశారు.

నేడు కృత్తివెన్ను మండల సమావేశం

కృత్తివెన్ను: కృత్తివెన్ను మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు కృత్తివెన్ను ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులతో పాటు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు.

చర్చి నిర్మాణానికి రూ.50వేలు విరాళం

బోడగుంట(మోపిదేవి): మండలంలోని బోడగుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. చర్చి పాలక వర్గ సభ్యుల విజ్ఞప్తి మేరకు బుధవారం ఈ మొత్తాన్ని వారి అకౌంట్‌కు జమ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విరాళం అందించిన శ్రీనివాసరావుకు కమిటీ పెద్దలు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

గూడూరు: మల్లవోలు జెడ్పీ ఉన్నత పాఠశాల పరిధిలో గత మార్చిలో జరిగిన పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన తెలుగు మీడియం విద్యార్థులకు గణిత ఉపాధ్యాయుడు నీలం హరిబాబు ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. పదవ తరగతి పరీక్ష ఫలితాలలో 90 శాతం పైబడి మార్కులు సాధించిన బి.కనకవరుణ అనే విద్యార్థినికి రూ.10వేల నగదు బహుమతి ప్రదానం చేశారు. ఆమెతో పాటుగా 60 శాతం పైబడి మార్కులు సాధించిన 20 మంది విద్యార్థినీ విద్యార్థులకు రూ.వెయ్యి విలువ కలిగిన స్మార్ట్ వాచ్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కోట నాగన్న, క్లాస్ టీచర్ వేణు సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన తైక్వాండో శిక్షణ

మచిలీపట్నంటౌన్: శ్రీ వేంకటేశ్వర అరవింద్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక ముస్తాఖాన్‌పేట దొంతులమ్మ తల్లి ఆలయం వద్ద గత నెల రోజులుగా నిర్వహిస్తున్న తైక్వాండో శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. తైక్వాండో, ఆత్మరక్షణ విద్యతో పాటు కర్రసాములో కోచ్ అరవింద్ సత్య శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగియటంతో జిల్లా తైక్వాండో సెక్రటరీ గ్రాండ్ మాస్టర్ పి.ఈశ్వర్, విశ్వ చేతుల మీదుగా శిక్షణ పొందిన బాలబాలికలకు ధ్రువీకరణ పత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో దొంతులమ్మ ఆలయ సభ్యులు నాగమల్లి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గూడూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల రోగాలు దరి చేరవని ఐసీడీఎస్ మల్లవోలు సెక్టారు సూపర్‌వైజర్ జన్ను రేవతి అన్నారు. డయేరియా నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై పోలవరం అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. బ్లీచింగ్, ఫినాయిల్ వంటివి పిచికారీ చేసి మన ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఎన్నారై శాయాజీ సేవలు ఆదర్శనీయం

ఘంటసాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యా సామగ్రి అందించిన ఎన్నారై దోనేపూడి శాయాజీ సేవలు ఆదర్శనీయమని పాఠశాల హెచ్‌ఎం జె.శ్రీనివాసరావు అన్నారు. ఘంటసాల మండలం దేవరకోట గ్రామానికి చెందిన ఎన్నారై దోనేపూడి శాయాజీ తన తల్లిదండ్రులు దోనేపూడి మునేశ్వరమ్మ – వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రూ.ఐదు వేల విలువైన నోటు పుస్తకాలు, పలకలు, ఇతర విద్యాసామగ్రిని దోనేపూడి మురళీ కృష్ణ, దోనేపూడి గిరీష్ చేతుల మీదగా బుధవారం పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయిని ముసునూరు సునీత అభ్యర్థన మేరకు దాత విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు.

రైతులతో వరుణుడి దోబూచులాట

- మబ్బులొస్తున్నా...వాన రాదాయే.!
- విత్తనాలు వేసి మొలక కోసం ఎదురుచూపులు
- మొలకెత్తిన నారును కాపాడుకునేందుకు ఆరాటం

పెడన: గత పది, పదిహేను రోజులుగా మబ్బులు వస్తున్నాయి... పోతున్నాయి..కాని వర్షం పడటం లేదంటూ రైతులు వాపోతున్నారు. కారుమబ్బులను చూసి ఆశతో రైతులు తమ పంట పొలాల్లో దుక్కులు దున్ని వరి విత్తనాలు జల్లి వాన కోసం చూస్తున్న రైతులు కొందరుంటే మరికొందరు మొలకెత్తిన విత్తనాల ద్వారా నారును కాపాడుకునేందుకు వానలు పడాలని దేవుళ్లను మొక్కుతున్నారు. మండల వ్యాప్తంగా 22వేల ఎకరాలలో వరి సాగవుతుండగా ఇప్పటికే 3వేలకు పైగా ఎకరాల్లో వెద సాగు ద్వారా విత్తనాలను రైతులు తమ పంట పొలాల్లో జల్లారు. కొందరు రైతుల పంట పొలాల్లో నారు ఇప్పటికే మొలకలు రాగా అవి కాస్తా ఎండకు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు దండిగా కురుస్తాయన్న ఆశతో ఆకాశం వంక ఎదురు చూస్తున్నారు. మరోపక్క కాలువల ద్వారా అయినా నీరొస్తుందన్న ఆశతో ఉన్నారు. పట్టిసీమలోను, పులిచింతలలోను కూడా నీరు అడుగంటడంతో కాలువల ద్వారా నీరు ఇప్పుడిప్పుడే వచ్చే పరిస్థితులు కానరావడం లేదు. వర్షాలు కురుస్తాయనే నమ్మకం కలగడం లేదు. మళ్లీ నీరు వచ్చినప్పుడు విత్తనాలు వేసుకుందామనే ఆలోచనతో పాటు ఈ దఫా నారు వేసుకుని నాటించుకుందామనే ఆలోచనతో రైతులున్నారు. లేదా గత ఏడాది వలే ఆలస్యంగా పంటలు వేసుకునే పరిస్థితి ఈ ఏడాది కూడా ఉంటుందన్న విషయాన్ని కొందరు రైతులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా నీరు పుష్కలంగా ఉన్న సమయంలోనే నాట్లు వేసుకుంటే మంచిదని రైతులు భావిస్తున్నారు.



పెడన మండలం నడుపూరు అగ్రహారం వద్ద వేసిన వెదసాగులో నారు



వర్షం పడుతుందన్న ఆశతో వరి విత్తనాలు జల్లుకుంటున్న రైతులు

ఘనంగా ఎమ్మెల్యే కాగిత జన్మదిన వేడుకలు

బంటుమిల్లి: పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్(కేపీ) జన్మదిన వేడుకలను బుధవారం టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. మండలంలోని నాగేశ్వరరావుపేట గ్రామంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా కాగితను గజమాలలు, దుశ్శాలువాలు, బొకేలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. మండలంలోని పెందుర్రు గ్రామానికి చెందిన జనసేన నాయకుడు గాజుల నాగబాబు 42 కేజీల భారీ కేక్‌ను తయారు చేయించి తన అభిమానాన్ని చాటుకున్నాడు. కాగిత జన్మదినం సందర్భంగా పలు ప్రభుత్వ శాఖల అధికారులు ఆయన్ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా మిల్క్ యూనియన్ డైరెక్టరు ఎ.నగేష్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, ఎన్‌డీఏ కూటమి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. బంటుమిల్లి శ్రీవేదగాయంత్రి బ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే కాగిత దంపతులకు వేద ఆశీర్వాదం అందజేశారు. సాతులూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వి.కరుణకుమార్, సర్పంచ్ జి.బాలస్వామి స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయ ఉద్యోగులు విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బిస్కెట్లు, మిఠాయిలు అందజేశారు.

ఎమ్మెల్యే కాగితకు శుభాకాంక్షలు తెలిపిన అధికారులు

పెడన: పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం పెడన మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలను తెలియజేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య, టీపీవో ఏసుబాబు, సచివాలయ ఉద్యోగులు, పురపాలక సంఘంలోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు, పీహెచ్‌సీ వైద్యాధికారి పర్వేజ్ హైదర్, సిబ్బంది ఉన్నారు.



నాగేశ్వరరావుపేట గ్రామంలోని ఆయన స్వగృహం వద్ద కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కాగిత

రోగులకు పండ్లు పంపిణీ

కృత్తివెన్ను: ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ జన్మదిన వేడుకలను బుధవారం టీడీపీ శ్రేణులతో పాటు ఆయన అభిమానులు ఘనంగా జరుపుకొన్నారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పిన్నెంటి రత్తయ్య ఆధ్వర్యంలో కృత్తివెన్ను పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాసరి బాలయేసు, పాలపర్తి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ర్యాలీ

మచిలీపట్నంటౌన్: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్‌సీసీ ఆంధ్ర 16 బెటాలియన్ క్యాడెట్లు డ్రగ్స్ నియంత్రణ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని ఎన్‌సీసీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన రహదారుల్లో సాగింది. డ్రగ్స్ వద్దు... భవిష్యత్తు, ఆరోగ్యం ముద్దు అంటూ ర్యాలీలో పాల్గొన్న క్యాడెట్లు నినదించారు. రోడ్లపై వెళుతున్న ప్రజలకు, వాహనదారులకు, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన ర్యాలీ

బంటుమిల్లి: ప్రపంచ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.జగన్‌మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.దేవజయ రాజు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థను సంపూర్ణంగా కొనసాగించాలి

నాగాయలంక: రాష్ట్రంలో సత్ఫలితాలు అందించిన వలంటీర్ వ్యవస్థను సంపూర్ణంగా కొనసాగించాలని పూర్వ దివి ఎల్ఎంబీ మాజీ చైర్మన్, శ్రీదుర్గా, గణపేశ్వర స్వామి ఆలయాల వంశపారంపర్య ధర్మకర్త మండల శ్రీరామ చంద్రమూర్తి(రాంబాబు) బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలతో మమేకమైన వలంటీర్లను ప్రభుత్వం, ప్రజల సేవలకు వినియోగించాలని సూచించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన రీతిలో రూ.10వేల వేతనంతో కొనసాగించడంతో పాటు రాజకీయ ఒత్తిడితో రాజీనామాలు చేసి ఉపాధి కోల్పోయిన ప్రతి ఒక్కరినీ యథావిధిగా విధుల్లోకి తీసుకోవాలని కోరారు. వలంటీర్లలో అత్యధికులు కాపు, బీసీ, ఎస్సీ వర్గాల యువత ఉన్నందున వారిని ఆదుకోవలసిన బాధ్యత ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై ఉందన్నారు.

లయన్స్ క్లబ్ కోడూరు అధ్యక్షుడిగా సాయిబాబు



సాయిబాబు

కోడూరు: లయన్స్ క్లబ్ దివిసీమ–కోడూరు మండలాధ్యక్షుడిగా పూతబోయిన సీతారత్న సాయిబాబు నియమితులయ్యారు. క్లబ్ జిల్లా గవర్నర్ గద్దే శేషగిరి రావు ఈ మేరకు బుధవారం నియామక పత్రాన్ని సాయిబాబుకు అందించారు. సాయిబాబు ఇప్పటి వరకు తొమ్మిది సార్లు క్లబ్ అధ్యక్షుడిగా పని చేశారు. క్లబ్ ప్రతినిధులు తనపై నమ్మకంతో పదో సారిగా అధ్యక్షుడిగా పదవి ఇచ్చినందుకు సాయిబాబు కృతజ్ఞతలు తెలిపారు.

మాదకద్రవ్యాలొద్దు...చదువులే ముద్దు

పెడన: విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి పోవద్దని మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య అన్నారు. ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయన పెడనలోని భట్ట జ్ఞానకోటయ్య(బీజీకే) జెడ్పీ హైస్కూలులో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల జోలికి పోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాదకద్రవ్యాల జోలికి పోమంటూ ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

గొగినేనిపాలెం(ఘంటసాల): యువత, విద్యార్థులు డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని గొగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు అన్నారు. ఘంటసాల మండలం గొగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాదక ద్రవ్యాల రహిత సమాజ స్థాపనకు తన వంతు కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేయించారు.

వసతి గృహాలను పరిశీలించిన ఎమ్మెల్యే మండలి

కోడూరు: కోడూరులోని వసతి గృహాలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బుధవారం పరిశీలించారు. శ్రీరామపురంలోని బీసీ బాలుర వసతి గృహం, స్వతంత్రపురంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని పరిశీలించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీసీ బాలుర వసతి గృహానికి సరైన భవనం లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు మండలి దృష్టికి తీసుకువచ్చారు. ఎస్సీ బాలికల వసతి గృహం చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరారు. వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని బుద్ధప్రసాద్ తెలిపారు. గృహాల్లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలన్నారు. అనంతరం మెరకగౌడపాలెంలో నిర్మాణ దశలో ఉన్న నైపుణ్య అభివృద్ధి కేంద్ర పనులను బుద్ధప్రసాద్ పరిశీలించారు. ఎంఈఓలు టీపీఎం రామదాసు, శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ డీఈ వెంకటేశ్వరరావు, వార్డెన్లు, పాల్గొన్నారు.

మహిళలకు ఫ్రీ బస్ సౌకర్యం ఎప్పటి నుంచి కల్పిస్తారు?

డయల్ యువర్ డీఎంలో ఓ ప్రయాణికుడి ప్రశ్న

అవనిగడ్డ: ఆర్టీసీలో మహిళలకు ఫ్రీ బస్ సర్వీసు ఎప్పటి నుంచి కల్పిస్తారని వక్కలగడ్డకు చెందిన జి.శేషు డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో డీఎంను ప్రశ్నించారు. స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ డిపో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఒక ప్రయాణికుడు అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అమలు చేస్తామని డీఎం చెప్పారు. మచిలీపట్నం నుంచి నాగాయలంకకు బస్సు సర్వీసులు పెంచాలని, ద్వారకా తిరుమల, నరసాపురం ప్రాంతాలకు బస్సులు నడపాలని, అవనిగడ్డ వయా ఘంటసాల మీదుగా గుడివాడకు, చల్లపల్లి ఘంటసాల వయా కొడాలి మీదుగా షటిల్ సర్వీసులు నడపాలని కోరారు. చల్లపల్లి బస్టాండ్‌లో స్టూడెంట్స్‌కు బస్ పాస్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, తీర ప్రాంత గ్రామాలు సొర్లగొంది, గుల్లలమోద, పాత ఉపకాలి నుంచి అవనిగడ్డకు వచ్చే సర్వీసులను రేపల్లె వరకూ పెంచాలని, కోడూరు నాగాయలంక మీదుగా అవనిగడ్డకు షటిల్ సర్వీసులు నడపాలని, అవనిగడ్డ– రేపల్లెకు సర్వీసులు పెంచాలని, గుడివాడ నుంచి అవనిగడ్డకు, అవనిగడ్డ నుంచి గుడివాడకు లాస్ట్ సర్వీసు 8 గంటలకు పెంచాలని, రేపల్లె రైల్వే స్టేషన్ వద్ద బస్సులు ఆపేలా చూడాలని, కోడూరు సెంటర్‌లో బస్ టైమింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలని, చల్లపల్లి నుంచి పెదకళ్ళేపల్లి రాత్రి సర్వీసు వేళలు పెంచాలని కోరారు. వీటన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామని డీఎం హనుమంతరావు తెలిపారు.

మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం క్షేమం

ఘంటసాల: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం క్షేమంగా ఉంటుందని చల్లపల్లి ఏరియా కోఆర్డినేటర్ ఎం.మధు అన్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో ఘంటసాల మండల ఏపీఎం బి.అమరేశ్వరరావు అధ్యక్షతన ఘంటసాల వెలుగు కార్యాలయంలో విజయశ్రీ మండల మహిళా సమైఖ్యలో పనిచేస్తున్న 42 మంది వీఓఏలకు ఆహారం – పోషణ – ఆరోగ్యం – పారిశుధ్యంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. కార్యక్రమంలో ఏసీ మధు మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు, పౌష్టికాహారం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి ఒక్క వీఓఏ ఆహార పోషణ కోసం వారి ఇళ్ల వద్ద పెరటి తోటలు పెంచుకుని పశువుల పేడ, ఇతర సేంద్రియ ఎరువులతో పండించుకోవాలని సూచించారు. గురువారం నుంచి డ్వాక్రా సంఘాల అధ్యక్షులకు శిక్షణ ఇస్తామని చెప్పారు.

వసతి గృహ ప్రాంగణాలలో దోమల మందు పిచికారీ

కోనేరుసెంటర్: బందరు మండలం చిన్నాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గురుకులం ప్రాంగణంలో బుధవారం దోమల నివారణ మందును పిచికారీ చేశారు. మండల పరిధిలోని పలు వసతి గృహాల్లో పాఠశాలలు పునః ప్రారంభం అయిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది మలాథియాన్ మందును పిచికారీ చేయించారు. కార్యక్రమంలో పాల్గొన్న మలేరియా ఆసుపత్రి ప్రతినిధి పి.మురళి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా లేకుంటే అనేక రకాల దోమలు వ్యాప్తి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు. దోమకాటు వలన మలేరియా, ఫైలేరియా, డెంగీ వంటి రోగాలు ప్రబలుతాయన్నారు. విద్యార్థులు వాటి బారిన పడకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు దోమల మందును పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. వసతి గృహాలు, విద్యాసంస్థల నిర్వాహకులు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్ జాన్ కెనడి, చిన్నాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్ వైజర్ సింహాద్రి రాంబాబు, ఏఎన్‌ఎం నాగలక్ష్మి, ఆశా వర్కర్ ధర్మజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన

- ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్
- విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ

కోడూరు: ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధన అందిస్తున్న అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు తమ చిన్నారులను చేర్చాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మండలంలోని స్వతంత్రపురం జెడ్పీ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఆయన స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎంఈఓ టీపీఎం రామదాసు అధ్యక్షతన నిర్వహించిన సభలో మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా ప్రవేశం ర్యాలీలో బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యన్నారాయణ, పాఠశాల ఉపాధ్యాయ బృందం బుద్ధప్రసాద్‌ను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఎంఈఓ–2 శ్రీనివాసరావు, హెచ్‌ఎం ఆలా రమణ, టీడీపీ, జనసేన పార్టీల మండల అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, మర్రే గంగయ్య, జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా నాయకురాలు కొండవీటి సునీత తదితరులు పాల్గొన్నారు.



కోడూరులో విద్యార్థులకు కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యంతో కూడిన విద్య

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరీ

చిట్టూర్పు(ఘంటసాల): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆరోగ్యంతో కూడిన విద్యనందిస్తున్నట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.మేరీ అన్నారు. ఘంటసాల మండలం చిట్టూర్పు అంగన్‌వాడీ కేంద్రంలో శ్రీకాకుళం సెక్టార్ పరిధిలోని చిట్టూర్పు, వేములపల్లి పంచాయతీల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు బుధవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మేరీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు సంవత్సరాల చిన్నారులకు పౌష్టికారంతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తారని చెప్పారు. అనంతరం ప్రీ స్కూల్ పూర్తి చేసిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్యక్రమంలో చిట్టూర్పు సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం బి.వెంకటేశ్వరమ్మ, ఏఎన్‌ఎం వై.చిత్రకళ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్త, ఆయాలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ మేరీ, హెచ్‌ఎం

సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయండి

- రక్షిత మంచినీటి చెరువులను పరిశీలించిన ఎమ్మెల్యే మండలి
- అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశం

కోడూరు: ప్రజలకు సురక్షితమైన తాగునీటిని సరఫరా చేసేందుకు అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మండలంలోని దింటిమెరక, మాచవరం గ్రామాల్లోని రక్షిత మంచినీటి చెరువులను బుధవారం మండలి ఆకస్మికంగా పరిశీలించారు. మాచవరం గ్రామంలో గత కొన్నేళ్ల నుంచి అభివృద్ధికి నోచుకోని చెరువు సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువును అభివృద్ధి చేసేందుకు అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. దింటిమెరక చెరువు ద్వారా పాలకాయతిప్ప, హంసలదీవి, దింటిమెరక గ్రామాల ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు మండలి దృష్టికి తీసుకువచ్చారు. ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను శుభ్రం చేసి క్లోరినేషన్ చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని బుద్ధప్రసాద్ ఆదేశించారు. అనంతరం చెరువులోని నీటిని ఖాళీ సీసాల్లో నింపి, నాణ్యతను పరిశీలించారు.



మాచవరం చెరువు వద్ద తాగునీటి శాంపిల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

–పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి...

ప్రస్తుతం వర్షాకాలం కావడంలో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీల అధికారులను బుద్ధప్రసాద్ ఆదేశించారు. పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలన్నారు. డ్రైనేజీల్లో మురుగు, రహదారుల వెంట చెత్తాచెదారం నిల్వ లేకుండా చూడాలని సూచించారు. గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీల అధికారులు, టీడీపీ, జనసేన పార్టీల నేతలు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాల్లో విద్యార్థినుల ప్రతిభ

470కి 466 మార్కులు

అవనిగడ్డ: ఇంటర్ అడ్వాన్స్ ఫలితాల్లో స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి విద్యార్థిని అల్లంశెట్టి లిఖిత, చల్లపల్లి విజయ జూనియర్ కళాశాల విద్యార్థిని పడవల శ్రీసత్యప్రియ 470కి 466 మార్కులు సాధించారు. విజయ కళాశాలకే చెందిన జ్యోత్స్న, నారంశెట్టి రక్షిత, డొక్కు లక్ష్మీ ప్రియాంక, తుపాకుల లోకన్య శ్రీ, మునగాల తేజస్వని 470కి 465 మార్కులు, దండాబత్తిన వరలక్ష్మి 500కి 481 మార్కులు సాధించినట్టు ఆయా విద్యా సంస్థల నిర్వాహకులు తెలియజేశారు.



అల్లంశెట్టి లిఖిత



పడవల శ్రీసత్యప్రియ

నీటితీరువా గ్రామ సచివాలయాల్లో చెల్లించండి

వీఆర్వోల సమీక్ష సమావేశంలో తహసీల్దార్

నాగాయలంక: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నీటితీరువా (శిస్తు వసూళ్లు) అంశాలపై తహసీల్దార్ ముప్పిరిశెట్టి హరనాథ్ వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నీటితీరువా చెల్లించవలసిన రైతులు సమీప సచివాలయాలకు వెళ్లి సంబంధిత డిజిటల్ అసిస్టెంట్‌ల వద్ద తీరువా చెల్లించి రసీదులు పొందాలని చెప్పారు. వీఆర్వోలు, వీఆర్ఏలు అందుకు తగిన విధంగా రైతులకు అవగాహన కలిగించాలని సూచించారు.

శ్రీరామపాద క్షేత్రం ఘాట్, నిర్మాణాలు పరిశీలించిన తహసీల్దార్

తహసీల్దార్ హరనాథ్ బుధవారం సాయంత్రం శ్రీరామపాద క్షేత్రం ఘాట్, నదీ పరీవాహక ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఘాట్‌లో నిర్మాణం తుది దశలో ఉన్న పర్యాటక శాఖకు చెందిన ఫుడ్‌కోర్టు భవనం, నిర్మాణ దశలో నిలిచిపోయిన జలక్రీడల(వాటర్ స్పోర్ట్స్) కేంద్ర భవనం, ఫిషరీస్ స్టోర్ బేస్డ్ భవనం పనులు ఏ స్థాయిలో ఉన్నాయో పరిశీలించారు. కార్యాలయ ఉద్యోగులు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొని అక్కడి విశేషాలను వివరించారు.



సమీక్ష సమావేశంలో తహసీల్దార్ హరనాథ్, వీఆర్వోలు

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు సత్కారం

అవనిగడ్డ: దివి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నాయకులు బుధవారం బుద్ధప్రసాద్ స్వగృహంలో ఆయన్ను కలిసి సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ధన సురేష్, కార్యదర్శి సుధాకర్, కోశాధికారి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.